క్లుప్తంగా

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మెట్‌పల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. అలాగే వారి వేతనాలను ట్రెజరీ ద్వారా ప్రతి నెల ఐదో తేదీ లోపు ఇవ్వాలన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగి కుటుంబంలో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని, జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్, శ్రీకాంత్, రమేశ్, మధురమ్మ, నర్సయ్య పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ దక్షిణమూర్తి

రాయికల్: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని కోరుట్ల డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బూర్ల దక్షిణమూర్తి అన్నారు. శనివారం పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో విద్యార్థులు–సామాజిక బాధ్యత అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు, విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని, ఒకసారి వాడిన ప్లాస్టిక్ మళ్లీ వాడకూడదని, వాయు, శబ్ద కాలుష్యం, నీటి కాలుష్యం తగ్గించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎద్దండి ముత్యంరాజురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలి



మంగేళలో పొలంబాటలో విద్యుత్ అధికారులు, రైతులు

సారంగాపూర్: రైతులు తమ వ్యవసాయ మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, దీంతో మోటర్లు కాలిపోకుండా నివారించవచ్చని విద్యుత్ శాఖ సహాయక అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలం మంగేళ, నర్సింహులపల్లి గ్రామాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిగా వారి సమస్యలను అడిగి తెలుసుకుని, విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను పరిశీలించిన చైర్‌పర్సన్

జగిత్యాల: సమీకృత మార్కెట్‌లో అన్నివస్తువులు లభిస్తాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శనివారం మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమీకృత మార్కెట్ ఏర్పాటుతో ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని, ఒకేచోట అన్ని లభ్యమవుతాయన్నారు. గతంలో రూ.4.5 కోట్లతో బీట్‌బజార్ వద్ద సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. మున్సిపల్ నుంచి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చిరంజీవి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాము పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

సాక్షి స్పందన

కథలాపూర్: మండలంలోని దూలూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మెట్‌పల్లి సీడీపీవో మణెమ్మ శనివారం పరిశీలించారు. ఈ నెల 16న సాక్షి దినపత్రికలో 'భయం భయంగా చదువులు' అనే శీర్షికన ఫొటో స్టోరీ ప్రచురితం కాగా, స్పందించిన అధికారులు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలిచ్చారు. తాత్కాలికంగా అద్దెభవనంలో తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ హైమది బేగం ఉన్నారు.

రైతులు ఆగం కావొద్దు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- 15 వార్డులో కొనుగోలు కేంద్రం ప్రారంభం

జగిత్యాల: రైతులు ఆగం కావొద్దని, ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని, ఇది రైతుపక్షపాతి ప్రభుత్వమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం 15వ వార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు అన్ని విధాలుగా సీఎం భరోసాగా ఉంటున్నారని, రుణమాఫీ, రైతుభరోసాపై ప్రతిపక్షాలు అనవసరపు రాద్ధాంతాలు చేస్తున్నాయని ఆరోపించారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, తోట మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏఈలు

ఇటీవల నూతనంగా నియమితులైన ఆర్‌అండ్‌బీ సారంగాపూర్ ఏఈ రాజేందర్, రాయికల్ ఏఈ సంజయ్ శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో ముందుకెళ్లాలి

ప్రతి విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పురాణిపేట పాఠశాలలో శనివారం రూ.13.5 లక్షలతో సైన్స్‌ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి కృషి చేస్తుందని, రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందన్నారు. అలాగే మహిళ డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లతో నూతన భవనం, తరగతి గదులు నిర్మించామని తెలిపారు. సైన్స్‌ల్యాబ్‌తో విద్యార్థులకు సాంకేతికత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కమిషనర్ చిరంజీవి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ల్యాబ్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, చైర్‌పర్సన్ జ్యోతి, అధికారులు

ఎమ్మెల్యే చొరవతో ప్రమాదకర బావి పూడ్చివేత

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయానికి నాచుపల్లి నుంచి చేరుకునే మార్గంలో రహదారి పక్కనే ప్రమాదకరమైన బావి ఉంది. ఈ బావిలో వాహనాలు పడి ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇటీవల ఆ ప్రాంతంలో ప్రమాదం చోటు చేసుకోగా అధికారులు,పోలీసులు అడ్డుగా బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ ఎప్పటికైనా స్థానికులు,అంజన్న దర్శన నిమిత్తం వచ్చే భక్తులకు ప్రమాదం పొంచి ఉందని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు తెలపగా, శనివారం కొండగట్టు దర్శన నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణంలో బావిని గమనించిన ఎమ్మెల్యే, వెంటనే పూడ్చాలని సంబంధిత అధికారులు, పోలీసులను ఆదేశించారు. దీంతో గంటల వ్యవధిలోనే ప్రమాదకర బావిని పూడ్చివేశారు. ఎమ్మెల్యే స్పందించి బావిని పూడ్చివేయించడంతో స్థానికులు,అంజన్న భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం,అధికారులు

విద్యుత్ సబ్ స్టేషన్ల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నిర్మాణంలో ఉన్న ధర్మపురి, దొంతాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్లను తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ చీఫ్ ఇంజనీర్(కన్‌స్ట్రక్షన్) బికంసింగ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ ఇంజనీర్లతో పాటు కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. విద్యుత్‌సబ్ స్టేషన్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరారు.

ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్

సారంగాపూర్: మండలంలో 14వ విడత చేపట్టిన జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, అసిస్టెంట్ డీఈవో దేవేందర్‌రెడ్డి, సోషల్ ఆడిట్ అంబుడ్స్‌మెన్ అధికారి కృష్ణారెడ్డి, ఎంపీడీవో గంగాధర్ హాజరయ్యారు. 18 గ్రామాల్లో ఏడాది పాటు చేపట్టిన పనుల్లో జరిగిన విచారణలో రూ.80,495 అక్రమాలు జరిగాయని ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతరులపై జరిమానా విధించారు. వీటిని రికవరీ కోసం పంచాయతీ కార్యదర్శులకు ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఉపాధిహామీ సిబ్బందికి జరిగిన నష్టాన్ని చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఆర్పీలు, డీఆర్పీలు, ఏపీవో శ్రీలత, ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న అధికారులు

కొనుగోళ్లలో జాప్యం జరగొద్దు

మెట్‌పల్లిరూరల్: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగవద్దని జిల్లా అడిషనల్ కలెక్టర్ లత అన్నారు. మెట్‌పల్లి మండలంలోని చౌలమద్ది,జగ్గాసాగర్,ఆత్మనగర్,బండలింగాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. కొనుగోళ్ల గురించి ఆరా తీశారు. కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకువచ్చి ఎన్ని రోజులు అవుతుంది? తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేస్తున్నారా లేదా? సౌకర్యాలు ఉన్నాయా లేదా తదితర విషయాలపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్,ఏపీఎం విమోచన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన



ధాన్యం పరిశీలిస్తున్న కృష్ణారావు

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్, ధర్మారం గ్రామాల్లో సన్నరకపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వటం పట్ల రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అంజిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. మండలం రామారావుపల్లిలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారులను నమ్మి మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ చక్రవర్తి, ఆర్ఐ పద్మయ్య, ఐకేపీ సీసీ గంగమణి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం చోరీ

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి కొనుగోలు కేంద్రంలో కాముని నడిపి నర్సయ్యకు చెందిన ధాన్యాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు బాధిత రైతు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలక్రైం: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల రూరల్ ఏఎస్సై శంకరయ్య అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థినులను వేదిస్తే షీటీంకు సమాచారం అందిస్తే చర్యలు చేపడతామన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎం మురళీమనోహరచారి, కానిస్టేబుళ్లు సుజాత, పూజిత పాల్గొన్నారు.

- **పాఠశాలకు ప్రొజెక్టర్ వితరణ**

రాయికల్: మండలంలోని అయోధ్య ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన ముస్కు చంద్రశేఖర్‌రెడ్డి శనివారం రూ.45 వేల విలువ గల ప్రొజెక్టర్‌ను వితరణగా అందించారు. కార్యక్రమంలోహెచ్‌ఎం అమరేందర్, రవీందర్‌రెడ్డి, కాటిపల్లి మహేశ్వర్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ గంగజల, నాయకులు పాల్గొన్నారు.

- **ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ**

మెట్‌పల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1979 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.16వేల విలువైన సౌండ్ సిస్టంను శనివారం అందజేశారు. కార్యక్రమంలో దురిశెట్టి మనోహర్, కోట గంగాధర్, అనిల్, గంగాధర్, హేమచంద్ర తదితరులున్నారు.

- **ధర్మపురిలో ఉచితంగా షుగర్ పరీక్షలు**

ధర్మపురి: లయన్స్‌క్లబ్‌ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ఉచితంగా మధు మేహ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు 130 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య, మామిడాల రవీందర్, సజ్జారావ్, పప్పుల శ్రీనివాస్,సత్యనారాయణ పాల్గొన్నారు.

- **బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ**

మేడిపల్లి: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన బండ్ల గంగారాం ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భీమారం మండల మన్నెగూడెం కొండ కిషన్ గౌడ్, కమ్మరిపేటలో వన్నెల దశగౌడ్ కుమారుడు సంజీవ్, జవ్వాజి జలందర్ ఇటీవల పలు కారణాలతో మరణించగా బాధిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు సురేశ్, అజిత్ రావు, ఆదిరెడ్డి,ఉన్నారు.

- **ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి**

పెగడపల్లి: ఈ నెల 23,24 తేదీల్లో మరోమారు ప్రత్యేక ఓటరు నమోదు చేపట్టనున్నట్లు తహసీల్దార్ బి రవీందర్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఓటరు సవరణలో భాగంగా ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు, చేర్పులు, మార్పులు, ఓటర్ల తొలగింపునకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 23,24 తేదీల్లో బూత్‌స్థాయి అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారని తహసీల్దార్ తెలిపారు.

- **తిప్పన్నపేటకు చేరిన మాలమహానాడు పాదయాత్ర**

జగిత్యాలరూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న మహా పాదయాత్ర శనివారం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చేరుకుంది. అంబేద్కర్ చౌరస్తా వద్ద మాలమహానాడు సంఘం నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి, మద్దతు ప్రకటించారు.

- **అయ్యప్ప స్వాములకు అన్నదానం**

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లిలో శనివారం అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి, కాంగ్రెస్ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మెట్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ కూన గోవర్ధన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్పస్వాములతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, స్వాములు పాల్గొన్నారు.

- **వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడిగా అయిల్నేని సాగర్ రావు**

జగిత్యాలటౌన్: పద్మనాయక వెలమ సంక్షేమ మండలి జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా జగిత్యాల పట్టణం హౌజింగ్ బోర్డుకు చెందిన అయిల్నేని సాగర్‌రావు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెలమ సంక్షేమ మండలి ప్రతినిధులు తెలిపారు.

- **నవోదయ విద్యాలయ పేరెంట్స్ కమిటీ మెంబర్‌గా కాయితి శంకర్**

రాయికల్: చొప్పదండి నవోదయ విద్యాలయంలో పేరెంట్స్ కమిటీ మెంబర్‌గా రాయికల్ పట్టణానికి చెందిన కాయితి శంకర్ ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఈ సందర్భంగా కాయితి శంకర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

- **రక్తదాన శిబిరం**

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 1992లో అయోధ్యలో కరసేవలో అమరులైన వారి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్,నాయకులు రాధాకృష్ణారెడ్డి, సంతోష్, అరుణ్, రోహిత్, పాల్గొన్నారు.

కోనాపూర్ సొసైటీ అధ్యక్షుడిపై అవిశ్వాసం?



వినతిపత్రం ఇస్తున్న డైరెక్టర్లు

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గుర్నాథం మల్లారెడ్డి పై ఉపాధ్యక్షురాలు మంగమ్మ, డైరెక్టర్లు అవిశ్వాసం తీర్మానానికి అనుమతి ఇవ్వాలని శనివారం జిల్లా సహకార అధికారికి వినతిపత్రం అందజేశారు. సహకార సంఘంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఆర్థిక లావాదేవీలతో పాటు, భవన నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, అధ్యక్షునిపై పలు అనుమానాలు కలుగుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధ్యక్షుడిపై అవిశ్వాసానికి అనుమతించాలని పాలకవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు.



జగిత్యాలటౌన్: అసలే ఇరుకైన యావర్‌రోడ్డు వెంబడి అంగడి బజారు ప్రాంతంలో ప్రతీ గురువారం జరిగే వారసంతతో ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నామని పట్టణ ప్రజలు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అంగడిబజారులోని రోడ్లపైనే ఎండు మిర్చి లాంటి నిత్యావసర సరుకులు విక్రయిస్తుండటంతో కూటు, ఘాటు భరించలేక ఇబ్బందులు పడుతున్నామని, వారసంతను పట్టణం వెలుపలికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చిరంజీవి, జగిత్యాల బల్దియా కమిషనర్. 9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

ఆలయాల్లో సుడా చైర్మన్ పూజలు

ధర్మపురి: శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కుటుంబ సమేతంగా శనివారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి స్వామివార్లను దర్శించుకున్నారు. చైర్మన్ దంపతులకు దేవస్థానం పక్షాన సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న దర్శించుకున్న 'కోమటిరెడ్డి'

కొండగట్టు: కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శనివారం జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్నను కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ అర్చకులు ఆయన గోత్రానామాలపై, ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థ ప్రసాదాలు అందజేసి,శాలువాతో సత్కరించారు.ఆలయ పర్యవేక్షకులు హరిహర నాథ్,టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, ఆలయ స్థానాచార్యులు కపిందర్, సిబ్బంది ఉన్నారు.



నరేందర్‌రెడ్డికి స్వామివారి శేష వస్త్రం,ప్రసాదాలు అందిస్తున్న అధికారులు

మోడల్ స్కూల్ బలోపేతానికి కృషి చేయాలి

మల్లాపూర్: మోడల్ స్కూల్ బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ భూమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ పద్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేటట్లు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా 10 తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణకు తల్లిదండ్రులు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ప్రగతి, ఫలితాలను తల్లిదండ్రులకు వివరించారు. సమావేశంలో మోడల్ స్కూల్ అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భూమేశ్

స్వగ్రామం చేరిన మహిళ మృతదేహం

కథలాపూర్: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన ఎన్నమనేని సుప్రియ (35)అనే వివాహిత దుబాయ్‌లో మృతిచెందగా, మృతదేహం శనివారం ఇంటికి చేరింది. గ్రామస్తుల కథనం ప్రకారం... రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన సుప్రియకు కథలాపూర్ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రావుతో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరు ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో నివసిస్తున్నారు. ఈ నెల 11న సుప్రియ తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో మృతి చెందినట్లు అక్కడున్నవారు గుర్తించారు. మృతదేహం ఇంటికి చేరడంతో బంధువుల, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతురాలికి భర్త శ్రీనివాస్‌రావు, 12 ఏళ్ల కూతురు దీక్ష, ఏడేళ్ల కుమారుడు ప్రణవ్ ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

వెల్గటూర్: క్రిమిసంహారక మందు తాగి యువకుడు బలవన్మరణం చెందిన సంఘటన వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జక్కుల మహేందర్ (36) చాలా రోజులుగా వివాహ ప్రయత్నాలు చేస్తున్నా ఇప్పటికీ కాకపోవడంతో, తన చావుకి ఎవరూ కారణం కాదని, తనకు వివాహం కాకపోవడం వల్లే జీవితం విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నాను అని సూసైడ్ లెటర్ రాసి శుక్రవారం అర్ధరాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించగా శనివారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

- **డివైడర్‌ను ఢీకొన్న కారు**

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం ముందు శనివారం సాయంత్రం లారీని ఓవర్‌టెక్ చేయబోయి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో కరీంనగర్–జగిత్యాల వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ట్రాఫిక్ ఎస్సై మల్లేశం సంఘటన స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో కారును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

- **వ్యవసాయ మోటార్ల చోరీ**

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులోని కాకతీయ కాల్వకు రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి.గ్రామానికి చెందిన రైతులు బడాల రాజేశ్‌కు చెందిన రూ.25 వేల విలువ గల 3 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న మోటార్,తోటలోని డ్రిప్ ఫిల్టర్ బుడ్డి, కొమ్ముల రాజేశ్‌కు చెందిన రూ.5 వేల విలువ గల రెండు వ్యవసాయ మోటార్లలోని కాపర్ వైర్లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దొంగల బెడదతో తీవ్రంగా నష్టపోతున్నామని,నెల రోజుల క్రితం కూడా కాల్వ వెంబడి ఉన్న కొందరు రైతుల మోటార్లలోని కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

- **హన్మాన్ ఆలయంలోకి చొరబడ్డ పాము**

మెట్‌పల్లి: పట్టణంలో హనుమాన్ ఆలయంలో శనివారం పాము చొరబడింది. మధ్యాహ్నం భక్తులు ఎవ్వరూ లేని సమయంలో పాము ఆలయంలోకి వెళ్లింది. దీనిని గమనించిన కొందరు వెంటనే పాముల పట్టే వ్యక్తికి సమాచారమందించారు. ఆయన అక్కడకు చేరుకుని పామును పట్టుకొని ఆ పట్టణ శివారులో వదిలేశారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఉన్న ఆలయంలో పాము చొరబడడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.